సాక్షి
బాపట్ల
శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



రామాలయ ప్రతిష్ట వేడుకలు

భట్టిప్రోలు: మండలంలోని అద్దేపల్లిలో నిర్మించిన రామచంద్రస్వామి ఆలయ నూతన ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి.



ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

మంగళగిరి: ఈనెల 29న నిర్వహించనున్న భావనారుషి విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్ట ఆహ్వాన పత్రికలను పద్మశాలీయ బహుత్తమ సంఘం ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 516.80 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

రాజ్యాంగంపై అవగాహన అవసరం



నరసరావుపేట: రాజ్యాంగంలోని అంశాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు రచించిన భారత రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రచించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, అందులోని అంశాలపై అవగాహన కలిగి ఉండాలనే లక్ష్యంతో రచించిన పుస్తకాన్ని విద్యార్థులంతా తప్పకుండా చదవాలని కోరారు. రాజ్యాంగంలోని ముఖ్యమైన అంశాలతో పాటు రచన కమిటీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన అమూల్యమైన కృషిని పుస్తకంలో ప్రస్తావించారు. రాజ్యాంగంపై విద్యార్థుల్లో మరింత విశ్వాసం, నమ్మకం పెంపొందించడమే లక్ష్యంగా ని రచించిన పుస్తకాన్ని లాభాపేక్షకు తావులేకుండా విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. నామ మాత్రపు రుసుముతో లభ్యమయ్యే రాజ్యాంగ ప్రవేశిక పుస్తకాన్ని విద్యాలయాల్లో లభ్యమయ్యేలా కృషి చేయాలని కలెక్టర్‌ను ఎమ్మెల్సీ కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్ కుమార్, జి. విజయసారథి పాల్గొన్నారు.

జగన్నాథునికి పంచామృత అభిషేకం



ముప్పాళ్ళ: చాగంటివారిపాలెంలో వేంచేసియున్న సుభద్ర బలభద్ర సహిత జగన్నాథ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం మొదటి రోజు పంచామృత అభిషేకం నిర్వహించారు.

శతాధిక వృద్ధురాలు మృతి



తిరుపతమ్మ(ఫైల్)

యడ్లపాడు: యడ్లపాడు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు పోపూరి తిరుపతమ్మ (102) బుధవారం రాత్రి ఆమె స్వగృహంలో మృతిచెందారు. ఆమెకు కుమారుడు కాళిదాసు, కుమార్తె సామ్రాజ్యమ్మతోపాటు మనుమలు, మనుమరాండ్లు, ముని మనుమలు, ఇలా ఐదు తరాలను ఆమె చూశారు. భర్త పోపూరి వెంకటేశ్వర్లు సుమారు 25 సంవత్సరాల కిందట మృతి చెందాడు. తిరుపతమ్మకు 102 సంవత్సరాలు వచ్చినప్పటికీ బీపీ, షుగర్, గ్యాస్ట్రబుల్ వంటి సమస్యలు ఏమీ లేవు. మందులు కూడా వాడేది కాదు. ఇప్పటికీ మంచాన పడకుండా తన పనులను తానే చేసుకుంటూ సాధారణ మృతి చెందింది.

నేడు స్టాఫ్‌నర్సులకు ప్రమోషన్ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 14 మందికి హెడ్‌నర్సులుగా ప్రమోషన్ కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ జి.శోభారాణి తెలిపారు. గుంటూరు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆర్డీ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే ప్రమోషన్ కౌన్సెలింగ్ కు జోన్-3లో ప్రమోషన్‌కు అర్హత ఉన్న 14 మంది స్టాఫ్‌నర్సులు హాజరు కావాలన్నారు.


నిదానంపాటి అమ్మవారి ఆదాయం రూ.12 లక్షలు



దుర్గి: అడిగొప్పల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.12,01,375ల ఆదాయం వచ్చినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మ బాయి తెలిపారు. గురువారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో 44 రోజుల పాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ కానుకల లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. ఈ నెల 24న ఆదివారం అమ్మవారి తిరునాళ్ల జరపనున్నట్లు పేర్కొన్నారు. వినుకొండ గ్రూప్ టెంపుల్స్ ఈఓ కొల్లి హనుమంతరావు, కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు, ఎస్ఎంఆర్ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కరణం టార్గెట్‌గా చంద్రబాబు కుట్రలు

- మైండ్ గేమ్‌తో ఇబ్బంది పెట్టే ఎత్తుగడ
- గెలిపిస్తే పార్టీలోకి వస్తామన్నారంటూ కరణంపై బాబు నిందలు
- చంద్రబాబు బండారాన్ని తూర్పారబట్టిన కరణం
- ఇందుకు ప్రతిగా ఈనాడు తప్పుడు రాతలు
- కరణం కుటుంబం అద్దంకి అడుగుతోందంటూ తప్పుడు ప్రచారం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: ఆది నుంచి రాజకీయ జీవితాన్ని కుట్రలు, కుతంత్రాలతో నెట్టుకొస్తున్న బాబుకు మైండ్‌గేమ్ వెన్నతో పెట్టిన విద్య. అదేవిద్యను కరణం బలరాం కుటుంబంపై ప్రయోగించి అభాసుపాలైంది. ఆయన పాచికలు పారకపోగా వారినుంచి ఎదురుదాడి తప్పించుకోలేక పోవడం చర్చనీయాంశమైంది. ఇటీవల ఇంకొల్లులో జరిగిన రా..కదలిరా సభలో చంద్రబాబు మాట్లాడుతూ తాము గెలిపిస్తే ఆ తర్వాత బలరాం పార్టీని వీడి వెళ్లారని, ఇప్పుడు మళ్లీ తనను గెలిపిస్తే టీడీపీలోకి వస్తామంటున్నారని విమర్శించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో అనుమానం కలిగించడమే కాకుండా.. నాయకులు, కార్యకర్తల్లో అయోమయం సృష్టించడమే చంద్రబాబు ఎత్తుగడగా కనపడుతోందని విశ్లేషకులు అంటున్నారు. కరణం కుటుంబ వ్యవహారం తెలిసిన జిల్లా వాసులతోపాటు టీడీపీ శ్రేణులు సైతం చంద్రబాబు మైండ్‌గేమ్ వ్యవహారాన్ని తప్పుబడుతున్నారు.

బట్టకాల్చి మీదవేసే ప్రయత్నం..

2014 ఎన్నికల్లో గెలిచిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు 23 మందిని చంద్రబాబు టీడీపీలోకి తెచ్చుకోవడాన్ని బలరాం తీవ్రంగా వ్యతిరేకించారు. ఇది సరికాదని, పార్టీకి తీవ్ర నష్టం చేస్తుందనీ హితబోధ చేశారు. కరణం మాటలను చంద్రబాబు ఖాతరు చేయలేదు. అప్పటినుంచే కరణం బాబుతో అంటీముట్టనట్లు ఉండేవారు. 2019 ఎన్నికల్లో చీరాల నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచినా.. ఆ తరువాత బాబుతో విభేదించి వైఎస్సార్ సీపీకి మద్దతు పలికారు. 2024 ఎన్నికల్లో తన కుమారుడు కరణం వెంకటేశ్‌ను చీరాల నుంచి పోటీలో నిలిపేందుకు బలరాం సిద్ధమయ్యారు. ఇందుకు సమ్మతించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటేశ్‌ను చీరాల సమన్వయకర్తగా నియమించారు. ఇది చంద్రబాబుకు కంటగింపుగా మారింది. ఇటీవల ఇంకొల్లుకు వచ్చి కరణం కుటుంబంపై విమర్శలు చేశారు. టీడీపీలోకి వస్తానంటున్నాడని బట్టకాల్చి మీదవేసే ప్రయత్నం చేశారు.

ఈనాడు తప్పుడు రాతలు..

బాబు నైజాన్ని వంటబట్టించుకున్న ఈనాడు పత్రిక కరణం కుటుంబం టార్గెట్‌గా తప్పుడు కథనాలు వండి వార్చింది. కరణం వెంకటేశ్‌కు చీరాలలో టికెట్ లేదని, అందుకే వారు అద్దంకి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారంటూ తప్పుడు రాతలు రాసింది. ఇందుకు కరణం కుటుంబం అద్దంకి పర్యటనలను ఉదహరించింది. అద్దంకిలో పానెం చిన హనిమిరెడ్డిని వైఎస్సార్ సీపీ కొత్త సమన్వయకర్తగా నియమించింది. ఆయన కోరిక మేరకు కరణం కుటుంబం అద్దంకి వెళ్లి మద్దతు కూడగడుతోంది. అద్దంకిలోనే కాకుండా పర్చూరు, సంతనూతలపాడు, కొండెపిలలోనూ కరణం కుటుంబానికి అనుచరగణముంది. అవసరమైతే పర్చూరు సమన్వయకర్త యడం బాలాజీకి మద్దతుగా అక్కడా కరణం కుటుంబం ప్రచారం చేస్తుంది. వాటిని పరిగణనలోకి తీసుకోకుండా అద్దంకి టిక్కెట్ కోసం కరణం కుటుంబం ప్రయత్నిస్తోందంటూ ఈనాడు వక్ర రాతలు రాసింది. దీని వెనుక బాబు మైండ్‌గేమ్ ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

బాబు బతుకు మొత్తం తెలిసిన కరణం బలరాం ఇందుకు ప్రతిగా మరుసటి రోజే విలేకరుల సమావేశం పెట్టి చంద్రబాబును ఏకి పారేశారు. తనను గెలిపించానంటున్న చంద్రబాబు తనయుడు లోకేశ్‌ను ఎందుకు గెలిపించలేదో చెప్పాలని వ్యంగాస్త్రాలు సంధించారు. చంద్రబాబు చీకటి బతుకు రోడ్డున వేస్తానని హెచ్చరించారు.

సచివాలయ వ్యవస్థలో వలంటీర్ల పాత్ర కీలకం

వలంటీర్లకు వందనంలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి



నగరంలో వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న ఎంపీ మోపిదేవి, సమన్వయకర్త డాక్టర్ గణేష్

నగరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థతోనే ప్రజల ఇంటి ముంగిటకు సంక్షేమ పథకాలు చేరుతున్నాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఎంపీ మోపిదేవి పాల్గొని మాట్లాడారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో వలంటీర్లు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి సంక్షేమ పథకాలను ప్రజల ఇళ్ల వద్దకు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. గ్రామ వలంటీర్లు సేవా దృక్పథంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. గ్రామ వలంటీర్ల సేవలను గుర్తించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు వందనం కార్యక్రమం కింద పురస్కారాలను అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ ప్రజా సేవే లక్ష్యంగా గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. గతంలో సంక్షేమ పథకాల కోసం, ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సివచ్చేదని ఇప్పుడు గ్రామ వలంటీర్లు నేరుగా ప్రజల ఇళ్లవద్దకే వెళ్లి సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య, జడ్పీటీసీ మాన్యం నాగమణి, ఎంపీడీఓ చక్రపాణి ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇంటర్, టెన్త్ పరీక్షలు

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: పదోతరగతి, ఇంటర్మీడియెట్, ఒకేషనల్ పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. పది, ఇంటర్ పరీక్షల నిర్వహణపై అనుబంధ శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. తొలుత అన్ని జిల్లాల కలెక్టర్‌లు, అనుబంధ శాఖల అధికారులతో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అమరావతి నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి కలెక్టర్ హాజరయ్యారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థులు హాల్ టికెట్ చూపితే ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలన్నారు. పరీక్షలు ముగిసే వరకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, ప్రాథమిక వైద్య కిట్‌లు సిద్ధం చేసుకోవాలన్నారు. మార్చి ఒకటి నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలకు, 18వ తేదీ నుంచి జరగనున్న పది పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ ఆర్ఐఓ పి.యర్రయ్య, డీఈఓ కె.నారాయణ, డీఎంహెచ్ఓ ఎస్.విజయమ్మ పాల్గొన్నారు.

సమగ్ర ప్రణాళికతో ఎన్నికలకు సిద్ధం

బాపట్ల: సమగ్ర ప్రణాళికతో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై ఈఆర్‌ఓలు, జిల్లా నోడల్ అధికారులతో గురువారం స్థానిక కలెక్టర్ చాంబర్లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికలకు అవసరమైన సామగ్రి సేకరణ, మానవ వనరులు, వాహనాలను సమకూర్చుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జేసీ సీహెచ్ శ్రీధర్, ఈఆర్ఓలు, జిల్లా నోడల్ అధికారులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు సీతారామయ్య పాల్గొన్నారు.

ప్రతి బుధవారం మిర్చి దిగుమతులు నిలిపివేత

మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డులో ప్రతి బుధవారం దిగుమతులను నిలిపియేయనున్నట్లు యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ పేర్కొన్నారు. సీజన్ కావడంతో ప్రతి రోజు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భారీస్థాయిలో రైతులు మిర్చి బస్తాలను తరలిస్తున్నారని తెలిపారు. యార్డుకు అధికంగా మిర్చి తీసుకురావడం వల్ల మిర్చి దిగుమతులు పెరుగుతున్నాయని వెల్లడించారు. దీంతో యార్డులో అమ్మకాలకు, కొనుగోలు చేసిన మిర్చి బస్తాలను బయటకు తరలించడానికి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోందన్నారు. యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి, ఎక్స్‌పోర్టర్స్ అసోసియేషన్ నాయకులు, యార్డు అధికారులతో గురువారం సాయంత్రం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ అందరి సూచనలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ప్రతి బుధవారం దిగుమతులను నిలిపివేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని వివరించారు. అలాగే ప్రతి బుధవారం యార్డులో క్రయ, విక్రయాలు యథావిధిగా జరుగుతాయని, కేవలం దిగుమతులను మాత్రమే నిలిపివేయడం జరుగుతోందన్నారు. మిర్చి రైతులు తమ మిర్చి బస్తాలను బుధవారం తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. మిర్చి దిగుమతి, ఎగుమతి వ్యాపారులు, ఎక్స్‌పోర్టర్స్, రైతులు వ్యవసాయ మార్కెట్ కమిటీకి సహకరించాలని సూచించారు. సమావేశంలో మిర్చి దిగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు లేళ్ల పెద అప్పిరెడ్డి, కుర్రి సాంబిరెడ్డి, ఎగుమతి వ్యాపారుల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ఎనలేనివి



సేవారత్న పురస్కారాలు అందజేస్తున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

- సేవా వారధులపైనా బురదజల్లడం టీడీపీ నేతలకే చెల్లింది
- టీడీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం
- వైఎస్సార్ సీపీ అద్దంకి సమన్వయకర్త చిన హనిమిరెడ్డి
- సంతమాగులూరులో వలంటీర్లకు వందనం

అద్దంకి (సంతమాగులూరు): సేవలకు ప్రతి రూపం వలంటీర్లు అని, వారి సేవలు ఎనలేనివని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. ఆయన గురువారం సంతమాగులూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమానికి ఎంపీడీఓ కాశయ్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా హనిమిరెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్నారన్నారు. అర్హులైన వారందరికీ పథకాల ఫలాలు నేరుగా అందుతున్నాయని గుర్తు చేశారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఒక వలంటీర్‌గా మారి వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వచ్చే విధంగా కృషిచేయాలని పిలుపునిచ్చారు. గత నాలుగున్నరేళ్లుగా వలంటీర్లు చేసిన సేవలు ఎనలేనివన్నారు. కోవిడ్ సమయంలో వారి సేవలు దేశ వ్యాప్తంగా ప్రశంసనీయమయ్యాయన్నారు. అదే విధంగా ఇప్పటికీ చాలామంది వలంటీర్లు ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంగా అయితే మీకు తగిన గుర్తింపు ఇస్తారని చెప్పారు.

టీడీపీ నేతలది విపరీత ధోరణి..

వలంటీర్ల సేవలకు ప్రజలు పట్టం కడుతుంటే టీడీపీ దానిని బూతద్దంలో చూస్తోందన్నారు. వలంటీర్లు ద్రోహులు అన్నట్టుగా చూపడానికి ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి, బంధువులకు, పార్టీ వారికే పథకాలు అందించిన విషయం ప్రజలకు గుర్తుందన్నారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందాలనే ఉద్దేశంతో సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. సేవాభావంతో పనిచేస్తున్న వలంటీర్లపైనా ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. ఇదంతా ప్రజలకు బాగా తెలుసని, రాబోయే ఎన్నికల్లో టీడీపీ దాని మిత్రపక్షాలకు బాగా బుద్ధి చెప్పి, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో మండలంలో 325 మంది వలంటీర్లలో ఐదుగురికి సేవా రత్న, మిగిలిన వారికి సేవా పురస్కారాలు అందజేశారు. పార్టీ మండల కన్వీనర్ చింతా రామారావు, నాయకులు ఓరుగంటి కోటిరెడ్డి, ఇప్పల మునలారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్లు రాజ్‌కుమార్, బొల్లినేని రామకృష్ణ, జెడ్పీటీసీ అడవి శ్రీనివాసరావు, మహేశ్ రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

సేవా వారధులు వలంటీర్లు



వేటపాలెంలో వలంటీర్‌ను సత్కరిస్తున్న కరణం వెంకటేష్

- వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త వెంకటేష్
- వేటపాలెంలో వలంటీర్లకు వందనం

వేటపాలెం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిస్వార్థంగా లబ్ధిదారుల చెంతకు చేర్చుతున్న వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ అన్నారు. గురువారం స్థానిక మండలం పరిషత్ కార్యాలయం ప్రాంగణలో ఏర్పాటు చేసిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ప్రవేశపెట్టి గ్రామాల్లోని ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని 99 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అనంతరం సేవావజ్ర అవార్డులకు ఎంపికైన వారికి రూ.45 వేలు, సేవా రత్న అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు రూ.30 వేలు, సేవామిత్రలకు రూ.15 వేల చొప్పున ప్రోత్సాహక నగదును వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, రామన్నపేట సర్పంచ్ కందేటి రమణ, ఉప సర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు పులి వెంకటేశ్వర్లు, ఆర్బీకే చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు, యువత అధ్యక్షుడు ఆవుల అశోక్, అందే కృష్ణ, కట్టా గంగయ్య, జంగిలి రామారావు, కట్టా జర్జి శ్యామేలు, కర్ణ లక్ష్మణరావు, నంగు ప్రభాకర్ రెడ్డి, జిడుగు మస్తాన్, ఆవులు కొండలు షేక్ ఖదీర్, బుర్ల శివ, పులి హరికృష్ణ, కర్ర వెంకటేశ్వర్లు, కె.విజయ్, ఎంపీడీఓ రూతమ్మ, ఏఓ ఐ.కాశీవిశ్వనాథ్, సచివాలయం కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

గెలుస్తాం.. చరిత్ర సృష్టిస్తాం

- ఈ జిల్లాలో టీడీపీ బ్యాచ్ గొర్రెలు కాసుకునే వాడికి మంత్రి పదవి ఇచ్చారంటూ ఎగతాళి చేశారు
- ఇక్కడే ఎంపీగా గెలిచి చూపిస్తా..
- జనం గుండెల్లో జగనన్న ఉన్నారు
- క్రోసూరు బీసీల ఆత్మీయ సదస్సులో నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్



మాట్లాడుతున్న అనిల్ కుమార్ యాదవ్, వేదికపై రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, మోపిదేవి, ఎమ్మెల్సీ ఏసురత్నం, ఎమ్మెల్యే శంకరరావు తదితరులు

క్రోసూరు,పెదకూరపాడు: చరిత్ర కలిగిన నర్సరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా మొట్టమొదటి సారి బీసీ అయిన నాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అవకాశం ఇచ్చారని ఇక్కడ గెలిచి, చరిత్ర సృష్టిస్తానని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు మార్కెట్ యార్డు ప్రాంగణంలో గురువారం రాత్రి నిర్వహించిన బీసీల ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అధ్యక్షత వహించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇదే జిల్లాకు చెందిన టీడీపీ పేటీఎం బ్యాచ్ నన్ను గొర్రెలు కాసేవాడినంటూ ఎగతాళి చేశారని, వారికి సవాల్ చేస్తున్నా ఇదే జిల్లాలో ఎంపీగా తాను గెలుస్తానన్నారు. నెల్లూరు నుంచి వచ్చే సమయంలో కొంత బాధపడ్డానని, పల్నాడులో అడుగుపెట్టాక జగనన్న సరైన ప్రాంతానికే తన్ను పంపారని అర్థమైందన్నారు. జనం గుండెల్లో గూడు కట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డిపై కట్టకట్టుకుని ప్రతిపక్షాలు వస్తున్నాయన్నారు. దమ్ము, పౌరుషం ఉన్న నాయకుడు సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని, అందుకే ఒంటరిగా ఎన్నికల బరిలో ఉన్నారన్నారు. ప్రజలు ప్రతిపక్షాల కుర్చీలను మడతేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు చొక్కాలు మడతపెట్టాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.

కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి..

వర్ధంతికి, జయంతికి తేడా తెలియని వ్యక్తి.. సరిగ్గా మాట్లాడటం రానివ్యక్తి పోటీలో ఉండొచ్చు గానీ, గొర్రెలు కాసుకునే నేను మంత్రిని కాకుడదా అని అనిల్ యాదవ్ ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ సత్తా చాటేందుకు 50 రోజులు మాత్రమే ఉందని, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తే నా లాగానే అనేక మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు చట్టసభల్లోకి వెళ్తారన్నారు. టీడీపీ నేతలు మోసం చేసేందుకు వస్తారని వారి మాటలు నమ్మవద్దన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎంపీగా తనకు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు రెండు ఓట్లు వేసి పెత్తందారుల గర్వం అణచాలన్నారు.

అక్రమార్కుల ఆట కట్టిస్తాం

- పర్చూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం
- నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ



మార్టూరు: నియోజకవర్గంలో అక్రమ గ్రావెల్, గ్రానైట్, ఇసుక వంటి అక్రమ రవాణాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీ హెచ్చరించారు. చీరాలలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహించడం ద్వారా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంను నెలకొల్పి వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అధికారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసేలా చర్యలు తీసుకుంటామని, వారికి ఏ ఇబ్బంది ఎదురైనా తన దృష్టికి తీసుకురావచ్చన్నారు. గ్రానైట్, గ్రావెల్, ఇసుక రవాణాపై ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీ, రాయల్టీ వంటి పన్నులు చెల్లించి స్వేచ్ఛాయుత వాతావరణంలో వ్యాపారం చేసుకోవచ్చన్నారు. అడ్డదారులకు పాల్పడి ఎవరైనా రహదారులు, కూడళ్లలో వ్యాపారులను అడ్డగించి వసూళ్లకు పాల్పడితే వారు అధికారులైనా, ప్రైవేటు వ్యక్తులైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

అందుబాటులో ఉంటా..

మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా విధానాలకు ఆకర్షితుడనై తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. ప్రజలను, అధికారులను ఇబ్బందులకు గురిచేసే ఏ చర్యను ఒప్పుకొనేది లేదన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు సైతం గ్రామ, పట్టణాల్లో అవసరమైన అనుమతులు తీసుకొని సంబంధిత పంచాయతీలకు పన్నులు చెల్లించి వ్యాపారం చేసుకోవచ్చన్నారు. నియోజకవర్గ కేంద్రం పర్చూరులో రెండు రోజుల్లో కార్యాలయం ప్రారంభిస్తానని, అన్ని మండల, గ్రామాల నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానన్నారు. గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటానన్నారు. ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ గెలుపే లక్ష్యంగా శ్రమించి పర్చూరు కోటపై వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయాలన్నారు.

క్లుప్తంగా

బాపట్ల డీఎస్పీ వెంకటేశులు బదిలీ

డీఎస్పీగా సీహెచ్.మురళీకృష్ణ నియామకం

బాపట్లటౌన్ : బాపట్ల డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న టి.వెంకటేశులును విజయవాడ ట్రాఫిక్‌కు బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. బాపట్ల డీఎస్పీగా విశాఖపట్టణం నార్త్‌లో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న సీహెచ్.మురళీకృష్ణను బాపట్ల డీఎస్పీగా నియమించారు. త్వరలో సీహెచ్. మురళీకృష్ణ బాధ్యతలు చేపట్టనున్నారు.

మేలు జాతి దూడల పెంపకంతో ఉపాధి



చీరాల టౌన్: వ్యవసాయం తర్వాత రైతులకు ముఖ్యమైన పాడిపరిశ్రమలో ఆర్థికంగా వృద్ధి చెందేందుకు మేలు జాతి దూడల పెంపకం చేయూతనందిస్తుందని బాపట్ల జిల్లా పశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ మద్దు హనుమంతరావు అన్నారు. గురువారం మండలంలోని గవినివారిపాలెంలో పశువైద్యుడు టి.శివారెడ్డి ఆధ్వర్యంలో పశుపోషకులకు మేలుజాతి దూడల ప్రదర్శన, దూడల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు, శిబిరాన్ని నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. చీరాల ఏడీఏ డాక్టర్ ఎస్.చిట్టిబాబు, పశువైద్యాధికారులు పావని, భాగ్యరాజు, విజయప్రకాష్, గౌరైలు, మేకల పెంపకందారుల ఫెడరేషన్ జిల్లా చైర్మన్ బొట్ల రామారావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

కారంచేడు: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన గురువు విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడనే కోపంతో విద్యార్థిని బంధువులు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. ఈ ఘటన గురువారం కారంచేడు మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివారాల మేరకు.. స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు విద్యార్థినితో గత కొన్నిరోజులుగా వేధిస్తున్నాడు. ఈక్రమంలో విద్యార్థిని ఇంట్లో చెప్పడంతో బంధువులు పాఠశాలకు చేరుకొని దేహశుద్ధి చేశారు. విషయం తెలిసిన పర్చూరు ఉప విద్యాశాఖాధికారి శ్రీనివాస్ పాఠశాలలో ఉపాధ్యాయులను, విద్యార్థులను వేర్వేరుగా మాట్లాడి వారి నుంచి సేకరించారు. వాటిని జిల్లా ఉన్నతాధికారులకు పంపించారు.

పర్చూరులో వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

ప్రభుత్వ సలహాదారు బత్తులతో సమన్వయకర్త బాలాజీ చర్చలు

యర్రంవారిపాలెం (కారంచేడు): త్వరలో జరగబోయే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీకే విజయావకాశాలున్నాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మార్కెటింగ్, సహకార రంగ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం ఆయన మండలంలోని యర్రంవారిపాలెంలోని ఆయన స్వగృహంలో పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త యడం బాలాజీలో కలసి పార్టీ పటిష్టతపై చర్చించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో పార్టీ పటిష్టత, నాయకుల మధ్య సమన్వయం వంటి విషయాలు చర్చించారు. మండలాల వారీగా తీసుకోవాల్సిన అనేకమైన విషయాలను వారు ముచ్చటించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి మంచి పట్టు ఉందని, ప్రతి ఓటును జాగ్రత్తగా పోల్ చేయించుకోవాల్సి ఉందన్నారు. అందుకు నాయకుల సమన్వయంగా పనిచేద్దామన్నారు. యడం బాలాజీని బత్తుల దంపతులు సత్కరించారు. కార్యక్రమంలో ఆదిపూడి సొసైటీ అధ్యక్షులు యర్రం లక్ష్మిరెడ్డి, యర్రంవారిపాలెం సర్పంచ్ ఈవూరి మాధవి, భవనం రాజగోపాల్‌రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



బాలాజీని సత్కరిస్తున్న బ్రహ్మానందరెడ్డి దంపతులు

కవిత్వం ఒక తపస్సు వంటిది

కవి బీరం సుందరరావు

బాపట్ల: కవిత్వం ఒక తపస్సు అని, అందులో నిష్ణాతులు కావాలంటే ఎన్నుకునే కవితా వస్తువు పట్ల అవగాహన కలిగి వుండాలని ప్రముఖ కవి బీరం సుందరరావు పేర్కొన్నారు. బాపట్ల జిల్లా రచయితల సంఘం, రోటరీ క్లబ్ ఆఫ్ బాపట్ల, బత్తుల సరీస్ ట్రస్ట్ చీరాల సౌజన్యంతో నిర్వహించిన అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవ సభలో ముఖ్య అతిథిగా పాల్గొని బీరం మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా నేడు కవిత్వం వ్యాప్తి చెందటం శుభ పరిణామం అయినప్పటికీ ఆ కవితా వస్తువు పట్ల నేటి వర్ధమాన కవులు బాధ్యత వహించటం లేదన్నారు. కవిత్వం రాయదలుచుకున్న వారు ముఖ్యంగా భాష పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన అధ్యక్షుడు తిమ్మన శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పాత తరం కవులను, రచయితలను స్ఫూర్తిగా తీసుకుని తాము సాహిత్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాపట్ల జిల్లాగా రూపాంతరం చెందాక బాపట్ల కవిత్వ పరిధి విస్తృతమయ్యేందుకు కృషి చేస్తున్నామన్నారు. బాలలలో తెలుగు భాషాభివృద్ధి కోసం త్వరలో వర్క్‌షాపులను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పెన్మెత్స నాగరాజు పేర్కొనగా, వర్ధమాన సినీ కవి ధవళేశ్వరపు జగదీశ్ తెలుగు పద్య వైభవాన్ని వివరించడమే కాక పద్యాన్ని అర్థం చేసుకునే క్రమం తెలిసుండాలని, భాష చారిత్రక అంశాలను వివరిస్తూ మాతృభాష మనుగడ కోసం చేపట్టవలసిన చర్యలను వివరించారు. ప్రముఖ పద్య, వచన కవులైన డాక్టర్ నారాయణం శేషుబాబు, అబ్దుల్ హాఫీజ్, వంగర శ్రీధర్‌లను పెన్మెత్స శ్రీరామరాజు సాహిత్య పురస్కారాలతో సత్కరించారు. అనంతరం రాష్ట్రస్థాయి వచన కవితల పోటీలో విజేతలైన గోలి రామచంద్రరావు, చుండూరి శేషమాంబ, హైమావతి సత్య, వి.ఎస్.ఎన్.శర్మ, లీలాకృష్ణ, పూర్ణ ప్రజ్ఞలకు బహుమతి ప్రదానం చేశారు. భాగి కృష్ణమూర్తి తెలుగు పద్య గానాలాపనతో సభికులను అలరించగా, ఎయిమ్ సేవ సంస్థ విద్యార్థులు ప్రదర్శించిన "వంకర టింకర శా" సందేశాత్మక హాస్య నాటిక ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యదర్శి నందిరాజు విజయ్‌కుమార్ సభా నిర్వహణను చేయగా బత్తుల బ్రహ్మారెడ్డి, డాక్టర్ రావూరి వీరరాఘవయ్య, గుండ్రెడ్డి సత్యనారాయణ, లక్కాకుల వెంకటరావు, షేక్ బాబావలి, అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రచయితను సన్మానిస్తున్న బాపట్ల జిల్లా రచయితల సంఘం నాయకులు

ఐసీఏఐ గుంటూరు రథసారథి నూతలపాటి

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ చైర్మన్‌గా నూతలపాటి అమర్‌నాథ్, కార్యదర్శిగా రుద్రవరపు భరద్వాజ ఎన్నికయ్యారు. శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ భవన్‌లో గురువారం 2024–25 సంవత్సరానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా వైస్ చైర్మన్‌గా చింతా రఘునందన్, కోశాధికారిగా నరేష్, సికాస చైర్మన్‌గా మృత్యుంజయ రావు, కమిటీ సభ్యులుగా వంగల భార్గవి, మద్ది రవితేజ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా నూతన చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ఐసీఏఐ గుంటూరు శాఖ భవనాన్ని పూర్తి చేసి, సీఏలకు, సీఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. ఆదాయపు పన్ను, జీఎస్టీ అధికారులతో పాటు అన్ని వర్తక సంఘాలను, సభ్యులను కలుపుకుని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఎస్ఐఆర్‌సీ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులకు సీఏ విద్యపై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి సీఏలుగా తీర్చిదిద్దుతామన్నారు.

బాలికపై లైంగిక దాడి

బాలుడిపై పోక్సో కేసు నమోదు

పెదకాకాని: మండలంలోని ఓ గ్రామంలో బాలికపై బాలుడు లైంగిక దాడి చేసిన సంఘటన వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మైనర్ బాలికను అదే గ్రామానికి చెందిన మైనర్ బాలుడు బలవంతంగా అత్యాచారం చేసినట్లు బాధిత బాలిక గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరి ఫిర్యాదు చేసింది. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గురువారం పెదకాకాని సీఐ కొమ్మన బోయిన వీరాస్వామి తెలిపారు.

దాడి కేసులో రెండున్నర ఏళ్లు జైలు

అమరావతి: మండల పరిధిలోని పెదమద్దూరులో 2019వ సంవత్సరంలో జరిగిన ఇరువురుపై దాడి సంఘటనలో అత్తోట రూబెనుకు గురువారం సత్తెనపల్లి కోర్టులో రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం... 2019వ సవంత్సరం సెప్టెంబరు 28వ తేదీన మండల పరిధిలోని పెదమద్దూరు గ్రామానికి చెందిన అత్తోట రూబెను అదే గ్రామానికి చెందిన కుక్కమళ్ల సోమమ్మ, అమె కుమారుడు కుక్కమళ్ల రాజేంద్రప్రసాద్‌లపై గొడ్డలి, కత్తితో దాడి చేసి గాయపరిచాడు. ఈ సంఘటనపై అప్పటి ఎస్ఐ డి.రవీంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపి చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ కేసును గురువారం సత్తెనపల్లి సెషన్స్ కోర్టు జడ్జి డి.వెంకటనాగలక్ష్మి విచారించి దాడికి కారకుడైన రూబెనుకు రెండున్నర సంవత్సరాల జైలు శిక్ష విధించారు.

వైఎస్సార్ సీపీ అసెంబ్లీ పరిశీలకుల నియామకం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల అసెంబ్లీ పరిశీలకులను నియమిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. గుంటూరు ఈస్ట్ పరిశీలకునిగా మిట్టపల్లి రమేష్ బాబు, గుంటూరు వెస్ట్ పరిశీలకునిగా రాతంశెట్టి సీతా రామాంజనేయులు(లాలుపురం రాము), తెనాలి పరిశీలకునిగా మందపాటి శేషగిరిరావు, ప్రత్తిపాడు పరిశీలకునిగా మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులయ్యారు.

- బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గ పరిశీలకునిగా శ్యాంప్రసాద్ రెడ్డి, రేపల్లె నియోజకవర్గం పరిశీలకునిగా అడపా శేషగిరిరావు, బాపట్ల పరిశీలకురాలిగా నల్లమోతు రూత్‌రాణి, పర్చూరు పరిశీలకునిగా తల్లం సాయి గోపాలకృష్ణ నియమితులయ్యారు.
- పల్నాడు జిల్లా చిలకలూరిపేట పరిశీలకునిగా చిట్టా విజయభాస్కర్ రెడ్డి, నరసరావుపేట పరిశీలకునిగా షేక్ గులాం రసూల్, సత్తెనపల్లి పరిశీలకునిగా పడాల సాంబశివారెడ్డి, వినుకొండ పరిశీలకునిగా యర్రం వెంకటేశ్వరరెడ్డి, మాచర్లకు దేవేళ్ల రేవతిని నియమించారు. పార్టీ పరిశీలకులుగా నియమితులైన వారు ఆయా నియోజకవర్గ పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషిచేస్తారు.

వైఎస్సార్ సీపీలోనే బీసీలకు సముచిత స్థానం

బాపట్ల అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలనలో బీసీలకు సముచిత స్థానం దక్కిందని బీసీ రాష్ట్ర సెల్ జోనల్ అధ్యక్షుడు బొట్ల రామకృష్ణ అన్నారు. బాపట్ల పట్టణంలోని కోన నంబర్స్‌లో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు బీసీ సంఘాల నేతలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి 50 శాతానికిపైగా నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చారన్నారు. మంత్రివర్గంలో 11 మంది బీసీలకు చోటు కల్పించడం గర్వించదగ్గ విషయమన్నారు. అసెంబ్లీ స్పీకర్‌గా బీసీకి అవకాశం ఇచ్చి సామాజిక సాధికారత నిరూపించారన్నారు. రాజ్యసభ సభ్యులుగా, ఎమ్మెల్సీలుగా నియమించారన్నారు. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్‌కు నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్తగా, కారుమూరు సునీల్‌ను ఏలూరు లోక్‌సభ సమన్వయకర్తగా నియమించి బీసీల పట్ల తనకు ఉన్న అభిమానాన్ని చాటారన్నారు. చంద్రబాబు బీసీలను ఎదగనివ్వడంలేదని విమర్శించారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేందేందుకు కృషి చేస్తున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. మరోసారి బీసీలందరూ ఐక్యమత్యంతో ఉండి రానున్న రోజుల్లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు పీటా వేణుగోపాల్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గవిని కృష్ణమూర్తి, బాపట్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ప్రసాద్, జమ్ములపాలెం సొసైటీ అధ్యక్షుడు ఎర్రాకుల సుబ్బారావు, బీసీ సెల్ నాయకులు పాల్గొన్నారు.



బొట్ల రామకృష్ణను సన్మానిస్తున్న బీసీ సంఘ నాయకులు

రాజరాజేశ్వరికి అలెగ్జాండర్ గ్రహంబెల్ అవార్డు

కారంచేడు: మండలంలోని రంగప్పనాయుడువారిపాలెం గ్రామానికి చెందిన రావెల్ల వీరరాఘవయ్య, శ్రీదేవి దంపతుల కుమార్తె రావెల్ల రాజరాజేశ్వరికి సెంట్రల్ గవర్నమెంట్ నేషనల్ అవార్డు (అలెగ్జాండర్ గ్రహంబెల్ అవార్డు) సొంతం చేసుకున్నారు. చీరాల ఇంజినీరింగ్ కాలేజీలో కంప్యూటర్ సైన్స్‌ను పూర్తి చేసుకున్న రాజరాజేశ్వరి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఆన్‌లైన్ పరీక్షలకు హాజరైంది. వీటిలో చూపిన ప్రతిభకును గుర్తించిన నిర్వాహకులు ఈ అవార్డును బహూకరించారు. అవార్డు న్యూఢిల్లీలో 21వ తేదీన అందుకున్నారు. బెంగళూరులో ఫుల్‌స్టాక్ డెవలప్‌మెంట్‌లో పూర్తిస్థాయి శిక్షణ పొందానని ఆమె తెలిపింది. ఈ అవార్డు వలన భవిష్యత్‌లో మంచి ఉన్నత విద్యను పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తుందన్నారు. మట్టిలో మణిక్యంగా పల్లెటూరి నుంచి ఈ అవార్డుకు తీసుకున్న తన కుమార్తెను చూసి గర్వపడుతున్నామని తల్లిదండ్రులు పేర్కొన్నారు.



ఢిల్లీలో టీసీఎస్ నుంచి అవార్డు తీసుకుంటున్న రాజరాజేశ్వరి

ఏటీఎంలో చోరీ యత్నం విఫలం

- ధ్వంసం చేసిన దుండగులు
- తెరుచుకోని సేఫ్ లాకర్
- పోలీసుల అదుపులో అనుమానితుడు

నాదెండ్ల: గణపవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఏటీఎంలో చోరీకి విఫల యత్నం జరిగింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డులో ఇండీక్యాష్ ఏటీఎం కేంద్రం ఏడాది కిందట ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎం వద్దకు వచ్చి గడ్డపార, ఇనుప రాడ్లు, సుత్తి, చువ్వలతో ఏటీఎం మెషీన్‌ను ధ్వంసం చేశారు. అయితే ఏటీఎం సేఫ్‌లాకర్ తెరుచుకోకపోవటంతో చేసేది లేక వెనుదిరిగాడు. చోరీకి ఉపయోగించిన వస్తువులను అక్కడే వదిలేశాడు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో దుండగుడు తెచ్చిన వస్తువులను తిరిగి తీసుకెళ్తుండగా స్థానికులు ప్రశ్నించటంతో పరారయ్యాడు. బుధవారం తెల్లవారుజామున బొడ్డురాయి సెంటర్‌లోని బెంగళూరు బేకరీలో జరిగిన చోరీ విషయం విదితమే. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నించి విడిచిపెట్టారు. పోలీసులు విడిచిపెట్టిన దుండగుడే ఏటీఎంను పగలగొట్టాడని స్వయంగా చూసిన స్థానికులు చెబుతున్నారు. చోరీ యత్నం తెలుసుకున్న పోలీసులు ఏటీఎం కేంద్రాన్ని పరిశీలించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.



గణపవరం మెయిన్ రోడ్డులో దుండగుడు ధ్వంసం చేసిన ఏటీఎం



చోరీ కోసం ఉపయోగించిన గడ్డపార, ఇనుప వస్తువులు

ఎన్జీరంగా వర్సిటీలో ఉయ్యాలవాడ వర్ధంతి

గుంటూరు రూరల్: బ్రిటీష్ పాలకును ఎదిరించి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మొదటి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్ శారదా జయలక్ష్మిదేవి తెలిపారు. ఉయ్యాలవాడ వర్ధంతి సందర్భంగా లాంఫాంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో గురువారం ఉయ్యాలవాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉయ్యాల వాడ నిత్య పోరాట యోధుడని తెలిపారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, జాయింట్ రిజిస్ట్రార్ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



ఉయ్యాలవాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న వీసీ డాక్టర్ శారదజయలక్ష్మిదేవి

మృతుడి కుటుంబానికి న్యాయం

- విద్యుదాఘాతంతో మృతిచెందిన కుటుంబానికి అండగా నిలిచిన మానవ హక్కుల కమిషన్
- 5 లక్షలు పరిహారం మంజూరు చేసిన విద్యుత్‌శాఖ



పిచ్చయ్య (ఫైల్)

పెదకాకాని: విద్యుదాఘాతంతో మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ అండగా నిలిచింది. కరెంటు తీగలు తెగిపడి మృతి చెందినా పట్టించుకోని విద్యుత్‌శాఖ కమిషన్ ఆదేశాలతో 5 లక్షలు నష్టపరిహారం మంజూరు చేసింది. మృతుడు బుల్లా పిచ్చయ్య కుమారుడు బెనర్జీ తెలిపిన వివరాల ప్రకారం పెదకాకాని మండలం, వెనిగండ్ల గ్రామానికి చెందిన బుల్లా పిచ్చయ్య, నాగమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. 2023 మే 24న పిచ్చయ్య తన కుమార్తె భవానీతో కలసి కొల్లిపర మండలం, తూములూరు గ్రామంలో జరుగుతున్న బంధువు మున్నంగి నాగరాజు కుమార్తె వివాహానికి వెళ్ళారు. మధ్యాహ్న సమయంలో టెంటు కింద భోజనం చేస్తుండగా పెద్ద గాలి వీచి అక్కడున్న చీమతుమ్మ చెట్టు విరిగి కరెంటు తీగలపై పడింది. తీగలు తెగి టెంట్ మీద పడటంతో అందరూ ప్రాణభయంతో పరుగులు తీశారు. ఆ సమయంలో టెంట్ కింద ఉన్న బుల్లా పిచ్చయ్య కరెంట్ షాక్ తగిలి అపస్మారక స్థితికి చేరుకున్నారు. స్థానికులు ముందుగా తెనాలిలో ప్రథమ చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించారు. ఆపరేషన్ చేసినప్పటికీ కరెంటు షాక్ ఎక్కువగా తగలడం వలన రెండు కాళ్లు స్పర్శ కోల్పోయాయని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూన్ 14వ తేదీన బుల్లా పిచ్చయ్య మరణించాడు. ఆకస్మాత్తుగా జరిగిన ప్రమాదంగా పరిగణనలోకి తీసుకుని మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని విద్యుత్ శాఖ అధికారులను కోరినప్పటికీ ఎటువంటి స్పందన లేదు. ప్రమాదం జరిగిన 24 గంటల్లోనే సమాచారం ఏఈ, పై అధికారులకు తెలియజేయాలని తప్పించుకున్నారు. గత్యంతరం లేక బాధిత కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సభ్యుడు (నాన్ జ్యుడీషియల్) డాక్టర్ గోచిపాతల శ్రీనివాసరావు సహకారంతో కర్నూలులోని న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి విద్యుత్ శాఖ నుంచి 5 లక్షల రూపాయలు నష్టపరిహారం మంజూరు చేసినట్లు సంబంధిత శాఖ అధికారులు తెలియజేశారు. ఈ తరహా పిటీషన్ కమిషన్ ముందు గానీ న్యాయస్థానం ముందుగానీ దాఖలు చేయలేదని వారు తెలిపారు. కమిషన్‌కు మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఐపీఎస్ అధికారి నివాసంలో చోరీ

పెదకాకాని: తాళాలు వేసి ఉన్న ఇంటిలో చోరీకి పాల్పడిన సంఘటన గుంటూరు జిల్లా కాజ టోల్‌గేట్ సమీపంలోని రామకృష్ణ విల్లాస్‌లో చోటు చేసుకుంది. మండలంలోని రామకృష్ణ విల్లాస్ (ఆర్‌కె)లో ఐపీఎస్ అధికారికి ఒక ఫ్లాట్ ఉంది. ప్రస్తుతం ఆయన అనంతపురం 14 బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళాలు పగులగొట్టి ఇంటిలోని ప్రవేశించారు. గమనించిన స్థానికులు కేకలు వేయడంతో దుండగులు పరారీ అయ్యారు. పోలీసులకు సమాచారం అందించడంతో చోరీ జరిగిన ఇంటిని గురువారం గుంటూరు క్రైం అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు, మంగళగిరి డీఎస్పీ సీహెచ్ రవికాంత్, సిబ్బంది పరిశీలించారు. ఇంటిలోని బీరువా పగులగొట్టి వస్తువులు, దుస్తులు చిందర వందరగా పడవేసినట్లు సమాచారం.

వర్తక వ్యాపారానికి లైసెన్సు తప్పనిసరి

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ దుకాణాలు, సంస్థల చట్టం 1988 కింద ప్రతి ఒక్క దుకాణ, సంస్థ వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని గుంటూరు జోన్–3 జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. ఆంధ్రప్రదేశ్, విజయవాడ కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు జాయింట్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు గురువారం వర్తక యాజమాన్య సంఘాలతో సమావేశం నిర్వహించారు. సొంత వ్యాపార దుకాణాలు, సంస్థలు కూడా లైసెన్సు పొందాల్సి ఉంటుందన్నారు. లైసెన్సు నమోదు ప్రక్రియ ఈనెల 29 లోపు పొందాలన్నారు. ప్రతి వర్తక యాజమాన్య సంఘాల వారు ఈ విషయమై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దుకాణాలు, సంస్థల యజమానులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో, మీసేవ సెంటర్ల ద్వారా దరఖాస్తు చేసుకుని సర్టిఫికెట్ పొందవచ్చన్నారు. 2024 ఫిబ్రవరి ముగుస్తున్నందున దుకాణ, సంస్థల యజమానులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. సర్టిఫికెట్ పొందని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర వివరాలకు కార్మిక శాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) బుధవారం ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అఖిల భారతస్థాయిలో విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. బ్రాడీపేటలోని మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎంఏ ఇంటర్‌లో అఖిల భారత స్థాయిలో ప్రకటించిన టాప్–50 ర్యాంకుల్లో బోయపల్లి ప్రీతమ్‌రెడ్డి 5వ ర్యాంకుతో పాటు ఇతర ర్యాంకులు సాధించిన విద్యార్థులు 49 మంది ఉన్నారని వివరించారు. సీఎంఏ ఫైనల్ టాప్–50 ర్యాంకుల్లో గోగుల భార్గవి 2వ ర్యాంకుతో పాటు 34 మంది విద్యార్థులు వేర్వేరు ర్యాంకులను కైవసం చేసుకున్నట్లు చెప్పారు. సీఎం ఫలితాల్లో సమానమైన మార్కులు వచ్చిన విద్యార్థులకు ఒకే ర్యాంకును, ఇద్దరు, ముగ్గురుకు ప్రకటిస్తారని పేర్కొన్నారు. సీఎంఏ ఇంటర్, ఫైనల్ ఫలితాల్లో మొదటి 50 ర్యాంకుల్లో 83ను కైవసం చేసుకున్న ఏకైక విద్యాసంస్థ మాస్టర్ మైండ్స్ అని తెలిపారు.



మాట్లాడుతున్న మట్టుపల్లి మోహన్

నేటి నుంచి శేషాచల శ్రీనివాసుడి బ్రహ్మోత్సవాలు

గంపలగూడెం(తిరువూరు): మండలంలోని పెనుగొలను శివారు శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 34వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి ప్రత్యేక కార్యక్రమాల వివరాలు గురువారం వెల్లడించారు. తొలి రోజు ఉదయం ఆరు గంటలకు సుప్రభాత సేవతో ప్రత్యేక కార్యక్రమాలను ఆలయ అర్చకులు యోగనందాచార్యులు ప్రారంభిస్తారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ One Sitting BA, BCOM, BSC, B.Tech, BPT, BPED, Agbsc pharmacy, ANM, GNM, BSC Nursing, LLB, Phd, Ph: 8919213858.

REAL ESTATE

■ పల్నాడు జిల్లా నకరికల్లు మండలం మెయిన్‌రోడ్ ప్రక్కనే ఉన్న 16 సెంట్లు స్థలం ఇంటికి గాని, కమర్షియల్‌కు ఉపయోగపడే స్థలం అమ్మకమునకు కలదు ✆8121281993

PLOT FOR SALE

■ అమరావతిరోడ్డు ఢిల్లి పబ్లిక్ స్కూల్ (లాం) ఎదురు వేగంగా నిర్మాణము జరుగుచున్న విల్లాస్ /ఓపెన్ ప్లాట్స్ వెంచర్‌లో E/W పేసింగ్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. 63097 63997

LEASE

■ గుంటూరు పరిసర ప్రాంతాల్లో 4000 చ॥ అడుగులు గల భవనం విద్యాసంస్థ నిర్వహణ కోసం లీజుకు కావలెను. 8919555874, 8142431240

TO-LET

■ GNT పొత్తూరువారితోట 8వ లైను నందు 2BHK, గ్రౌండ్‌ఫ్లోర్ ఇండివిడ్యువల్ హౌస్ కార్ పార్కింగ్‌తో రెసిడెన్షియల్/ కమర్షియల్‌గా అన్ని సౌకర్యములతో అద్దెకు కలదు. సంప్ర: 9985110006, 9848483863

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 945 945 3338

■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

■ Need machine operator (training will be provided) Any degree Age: 18-30, Timings: 8:30-7:30, Sal: upto11k Cont: pattabhipuram Cell: 8712128699

■ నారాకోడూరు, పొన్నూరు పరిసర ప్రాంతాలలో సెక్యూరిటీ గార్డులు కావలెను. మరియు హోటల్‌లో ఫుడ్ సర్వింగ్ కొరకు బాయ్స్ మరియు గార్ల్స్ కావలెను. 9652689259, 9885991250

■ యడ్లపాడు వద్ద గల బోయపాలెంలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అ:10th,ఇంటర్,12గం॥డ్యూటీ-12500. సంప్ర॥✆9502087373

■ పార్ట్‌టైమ్ మాన్యువల్ ఉద్యోగులకు & రిటైర్డ్ (govt / pvt) ఎంప్లాయిస్, పార్ట్‌టైమ్/ఫుల్‌టైమ్ వర్క్ కలదు. బ్యాంక్స్, రియల్‌ఎస్టేట్ నందు చేయుటకు కావలెను: 9989077553

■ వెబ్ పేజీ యాప్ నందు వర్క్ చేయుటకు డిజైన్ డెవలపర్స్, డేటా ఎంట్రీ ఆపరేటర్స్, తెలుగు, ఇంగ్లీష్ టైపిస్టులు కావలెను. అర్హత: ఇంటర్, గుంటూరు సంప్ర॥ 7799988837

■ సత్తెనపల్లి ఆఫీస్ నందు పనిచేయుటకు డేటా ఎంట్రీ ఆపరేటర్ కావలెను. అర్హత: 10+ఇంటర్, డిగ్రీ మరియు బేసిక్ కంప్యూటర్ నాలెడ్జి. 7013894058

■ మందాడి, మాచర్ల, నాగార్జున సాగర్ ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. రూమ్‌ఫ్రీ, జీతం: 12500/-. ✆ 7569673994

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ ఫామ్ ల్యాండ్స్ కంపెనీలో వర్క్ చేయుటకు డోర్ టు డోర్ మార్కెటింగ్ టీమ్స్, మార్కెటింగ్ టీమ్ లీడర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 12000+ ఇన్సెంటివ్స్, సంప్ర: 9010320501

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచైజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్‌టైమ్ / ఫుల్‌టైమ్‌గా వర్క్ చేస్తూ 15 వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9502615217

■ గుంటూరు,విజయవాడలోని ప్రముఖ హాస్పిటల్స్ లలో పనిచేయుటకు వార్డ్‌బాయ్స్, నర్సింగ్ ఎయిడ్ స్టాఫ్ కావలెను.అ:10thపాస్, ఇంటర్వ్యూ: 22,23,24 తేదీలలో సంప్ర: 8121129652

■ Drivers మరియు Male Nursing ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు కావలెను. 93463 70090

■ ప్రముఖ కంపెనీ పార్ట్ టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. డైలీ పేమెంట్స్ కలవు. మీ పేరు అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 98856 82589

■ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు వర్క్ చేయుటకు డోర్‌టుడోర్ మార్కెటింగ్ టీమ్స్, మార్కెటింగ్ టీమ్‌లీడర్స్, లేడీ రిసెప్షనిస్ట్ కావలెను. సంప్ర: 9390963940

■ గుంటూరులో గల ప్రముఖ రియల్ ఎస్టేట్ ఆఫీస్‌లో పనిచేయుటకు అకౌంటెంట్ (అ:ట్యాలీ+ ఒక సం॥ అనుభవం), ఆఫీస్‌బాయ్స్, సైట్ సూపర్‌వైజర్స్ (M/F) కావలెను. సంప్ర: 9963784919

■ Ltd కంపెనీలో డేటాఎంట్రీ, రిసెప్షనిస్ట్, టెలికాలర్స్, సూపర్వైజర్స్, అకౌంటెంట్స్, ఆఫీస్ ఇన్‌చార్జెస్, మనీరికవరీ, ఆఫీస్‌బాయ్స్, హెల్పర్స్ Q:10th-PG,జీ.10–25వేలు. ఫోన్: 7993976590

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/– సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 8573633520, 9059633520.

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ మేసేజ్‌లు పంపుతూ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. డైలీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సాప్ చేయగలరు. 95027 12418, 90306 12463

■ రామకృష్ణ గ్రూపు, (AP, న్యూ ఢిల్లీ No.1) శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధులకు/పేషంట్ల సేవకు, ఇంటి / వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్స్ కావలెను. భో+వ + జీ: 15-18 వేలు, ఏజెంట్లకు 5 వేలు కమీషన్ ✆ 92814 52843, 92814 52838

■ ఇంటి దగ్గర ఉండి మా కంపెనీ కాల్స్ మాట్లాడడానికి ఫిమేల్ టెలికాలర్స్ అ. కా,ను జీ. 17k to 29k డిటేల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్: 9885428966

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, పెన్సిల్స్, మాస్క్ తయారు చేయటానికి, పెట్టుబడి మీరే పెట్టుకోవారికి ఉచిత శిక్షణ. ఫోన్: 9491986565.

FACULTY TEACHERS

■ Wanted Teachers to Primary and Pre Primary Classes. (Savalyapuram) Salary Negotiable Please Contact: 7907219972

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే (4 లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
ఈ పేజీలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని పరిశీలించి పరిశీలించిన పిదప ప్రత్యుత్తరం చేయాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.